జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శుక్రవారం 9 జనవరి 2026 | సంపుటి : 1 | సంచిక : 8 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## హజ్ యాత్రకు ఈ 6 వర్గాలకు నో ఛాన్స్



- తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్నవారకి హజ్ యాత్రకు అనుమతి లేదని సౌదీ ప్రభుత్వం వెల్లడి
- ప్రైవేట్ గ్రూపుల ద్వారా హజ్ యాత్రకు వెళ్లే వారు ఈ నెల 15 లోపు తమ బుకింగ్‌లను పూర్తి చేయాలి
- సౌదీ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ

3



## సాదాబైనామాకు అఫిడవిట్ అక్కర్లేదు

### నేడో, రేపో ఉత్తర్వులు ఇవ్వనున్న సీసీఎల్ఏ

### మార్గదర్శకాలను సవరించేందుకు కసరత్తు

### పెండింగ్ దరఖాస్తులకు ఆటంకం తొలిగినట్లే

హైదరాబాద్

సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి ప్రధాన ఆటంకంగా ఉన్న 'అఫిడవిట్' నిబంధనను తొలగించేందుకు సీసీఎల్ఏ సన్నద్ధమవుతోంది. దీనిపై ఒకటి, రెండు రోజుల్లోనే పూర్తి స్పష్టతతో ఉత్తర్వులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు మార్గదర్శకాల్లో కొన్ని మార్పులు చేసి ప్రకటన జారీ చేయనుంది. భూభారతి చట్టంలోని సెక్షన్ 6, సబ్ సెక్షన్ 1 ప్రకారం సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి అధికారాలు కల్పిస్తూ గత ఏడాది సెప్టెంబరు 10న రెవెన్యూ శాఖ జీవో నంబరు 106ను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, భూభారతి - మిగతా2లో

## నాణ్యతలో రాజీ పడొద్దు

- విద్యార్థులకు అందించే అల్పాహారంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి
- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ వేగం పెంచాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- బాలికలకు తొలి ప్రాధాన్యమివ్వాలి
- జూన్ 12 నుంచి బడుల్లో అల్పాహారం
- ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి..
- ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



హైదరాబాద్

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పనులను ప్రాధాన్యతాంశంగా తీసుకోవాలని, రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే జూన్ 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్ళల్లో విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గురువారం విద్యారంగంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యకు సంబంధించిన పలు అంశాలపై సీఎం దృష్టి పెట్టారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, నిర్మాణ డిజైన్లను కన్సల్టెన్సీ - మిగతా2లో



## రోడ్డు ప్రమాదాల నివారణకు వీ2వీ సాంకేతిక పరిజ్ఞానం

- కార్లలో వైర్‌లెస్ వ్యవస్థ: నితిన్ గడ్కరీ
- టెలికమ్యూనికేషన్ల శాఖ సహాయంతో దీన్ని అభివృద్ధి చేస్తాం
- ప్రపంచ స్థాయి ప్రమాణాలను పాటించడం కోసం మోటారు వాహనాల చట్టంలో 61 సవరణలు తీసుకొస్తామని వెల్లడి

## డీలర్ వద్దే రిజిస్ట్రేషన్

- వ్యక్తిగత వాహనాలకు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు
- 15 రోజుల్లో అందుబాటులోకి రానున్న సాఫ్ట్‌వేర్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్

కొత్తగా వ్యక్తిగత వాహనాలను కొన్నప్పుడు రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ఏడాది డిసెంబరు 19న రవాణా శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో డీలర్ల వద్దనే వ్యక్తిగత వాహనాల రిజిస్ట్రేషన్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశంతో యంత్రాంగం ఈ సంస్కరణలను చేపట్టింది. రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డీలర్ల వద్దనే రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. గతంలో వాహన కొనుగోలుదారులు - మిగతా2లో




# సర్.. పెద్ద కుట్ర



- ఇల్లు, ఆస్తిలేని పేదలకు ఓటు ఒక గుర్తింపు
- దాన్ని తీసివేసేందుకే భాజపా పన్నాగం పన్నింది
- ఫిబ్రవరి 3 నుంచి 9 ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ సభలు
- తొలుత మహబూబ్‌నగర్ జిల్లాలో లక్ష మందితో...
- మున్సిపల్ ఎన్నికల్లో బీఫాం ఎవరికిస్తే వారిని ఐక్యంగా గెలిపించాలి
- పీసీసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరిట చేపట్టిన కార్యక్రమం వెనుక పెద్ద కుట్ర దాగుందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఇల్లు, ఆస్తిలేని పేదలకు ఓటుహక్కు ఒక గుర్తింపు అని, దాన్ని తీసివేసే పన్నాగంతోనే 'సర్' తీసుకొచ్చారన్నారు. ఓటుహక్కు పోతే ఆధార్, రేషన్‌కార్డులు పోతాయని అప్పుడు పేదలకు ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు రద్దవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. కోట్ల మంది పేదలను కట్టుబానిసలుగా తయారు చేయడానికి భాజపా కుట్ర చేస్తోందని ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. "దేశ ప్రజలందరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది కాంగ్రెస్. అలాంటి రాజ్యాంగాన్ని రద్దు చేయాలని మోదీ కుట్రపన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తమకు 400 సీట్లు ఇస్తే నూతన పరిపాలన తెస్తామంటూ ప్రజల దగ్గరకు వెళ్లారు. అదే జరిగితే... భాజపా రాజ్యాంగాన్ని కాలరాసి, దేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు - మిగతా2లో



## ఈడీ x దీదీ

- కోల్‌కతాలో ఐ-ప్యాక్ కార్యాలయంలో సోదాలపై భగ్గుమన్న బెంగాల్ సీఎం
- బొగ్గు కుంభకోణంపై దర్యాప్తులో భాగంగానే తనిఖీలన్న ఈడీ
- ఆ పేరుతో తృణమూల్ సమాచారం తీసుకువెళ్లారని మమత మండిపాటు
- ప్రతీక్ జైన్ నివాసానికి సీఎం వెళ్లడంతో హైడ్రామా
- బెంగాల్‌లోని ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ మైన్స్‌లో వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దొంగతనానికి గురైనట్లు 2020లో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు

3

# నాణ్యతలో రాజీ పడొద్దు

-మొదటిపేజీ తరువాయి

సంస్థలు ఆయనకు వివరించాయి. కాగా రెండేళ్ళలో అన్ని స్కూళ్ళ నిర్మాణం పూర్తి చేసి, తరగతులు మొదలు పెట్టాలని సీఎం ఆదేశించారు. బాలికలకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ జిల్లాల వారీగా బాలురు, బాలికల వివరాలు తెప్పించాలని ఆదేశించారు. ఈ స్కూళ్లకు అవసరమైన బడ్జెట్ విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 'అక్షయ పాత్ర భాగస్వామ్యంతో జూన్ నుంచి పాఠశాల విద్యార్థులకు అందించే అల్పాహారంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఈ పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అందించే భోజనం నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలి. వంటకు సోలార్ పవర్‌ను వాడుకునే అంశాన్ని పరిశీలించాలి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 కొత్త పాఠశాల భవనాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలి. బాచుపల్లి పాఠశాల భవన నిర్మాణానికి ప్రస్తుతం ఉన్న స్థలానికి సమీపంలో ఎకరన్నర కేటాయించాలి..'అని సీఎం ఆదేశించారు.

**ఖర్చుతో కూడిన ప్రతిపాదనలు తేవద్దు**

ప్రభుత్వ స్కూళ్లల్లో మౌలిక వసతుల కల్పన, భవనాల మరమ్మతులతో పాటు పలు అంశాలను పాఠశాల విద్యా కమిషనర్ ప్రస్తావించారు. అయితే ఖర్చుతో కూడిన ప్రతిపాదనలు ప్రస్తుతానికి వద్దని ముఖ్యమంత్రి అన్నట్టు సమాచారం. ఎంఈవో పోస్టుల భర్తీని కూడా సీఎం వ్యతిరేకించినట్టు తెలిసింది. రాష్ట్రంలో విద్యార్థుల నిష్పత్తి కన్నా టీచర్లు ఎక్కువగా ఉన్నారని, హేతుబద్ధీకరణ చేపట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

**త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ: సీఎం**

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురానున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై అధ్యయనం కోసం ఓ కమిటీ ఏర్పాటు చేశామని, త్వరలోనే పాలసీని



ప్రకటిస్తామని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి రోహిత్‌కుమార్ నేతృత్వంలోని ఆ రాష్ట్ర బృందం గురువారం సచివాలయంలో సీఎంను మర్యాపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి వారికి వివరించారు. ప్రైవేటు బడులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రీ ప్రైమరీ విద్యను ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రవాణా సదుపాయం కల్పించాలని యోచిస్తున్నామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. కాగా దీనిపై సమగ్ర నివేదికను అందించాలని హిమాచల్‌ప్రదేశ్ మంత్రి సీఎంను కోరారు.

**నేడు రావిర్యాలలో సీఎం పర్యటన**

తుక్కుగూడ: సీఎం రేవంత్ గురువారం రావిర్యాలలో పర్యటించనున్నారు. మంఖాల్ డివిజన్ పరిధిలోని ఫ్యాబ్‌సిటీలో మనీషా గ్రూప్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన సుజిన్ మెడికే ర్ ప్రైవేటు లిమిటెడ్ ఐవీ ద్రవం తయారీ కంపెనీని ఉదయం 10 గంటలకు సీఎం ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

**భవిష్యత్తులో ఇంటర్ బోర్డు ఉండదు!**

పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజనీరింగ్ కాలేజీలుగా ఉన్నతీకరించాలన్న ప్రతిపాదనపై సీఎం అనేక ప్రశ్నలు సంధించారు. ఇదెలా సాధ్యమని, అనుబంధ గుర్తింపు ఎలా వస్తుందని, ఏఐసీటీఈ అనుమతి ఇస్తుందా? అని ప్రశ్నించారు. ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం ప్రతిపాదనను కూడా తోసిపుచ్చారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అందుబాటులోకి వస్తే 12వ తరగతి వరకూ అక్కడే ఉంటుందని, భవిష్యత్తులో ఇంటర్ బోర్డు ఉండదని సీఎం అన్నట్టు తెలిసింది. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, పి.సుదర్శన్‌రెడ్డి, సీఎంఓ, విద్యాశాఖ ఉన్నతాధికారులు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# సాదాబైనామాకు అఫిడవిట్ అక్కర్లేదు

-మొదటిపేజీ తరువాయి

చట్టంలో పేర్కొనని మూడు అంశాలను మార్గదర్శకాల్లో చేర్చడం అప్పట్లోనే చర్చనీయాంశంగా మారింది. ఇందులో అత్యంత కీలకమైనది భూమి విక్రయించిన వ్యక్తి నుంచి అఫిడవిట్ తీసుకురావాలన్న నిబంధన. విక్రయదారుడి నుంచి అఫిడవిట్ తేవాలని ఒత్తిడి తెస్తే.. కొనుగోలుదారుల హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అఫిడవిట్ తప్పనిసరి అంటే నకిలీ అఫిడవిట్లు తయారు చేసే ప్రమాదం ఉంటుందని, దీని వల్ల భూ వివాదాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందనే చర్చ జరిగింది. విక్రయదారు మరణించినా, లేదా వారసులు ఎవరనే దానిపై వివాదాలున్నా అఫిడవిట్ సేకరించడం కష్టమవుతుందన్న వాదన వినిపించింది. ఎప్పుడో కొనుగోలు చేసిన భూమికి ఇప్పుడు అఫిడవిట్ అడిగితే ఎవరూ అంగీకరించరని, సానుకూలత తక్కువ ఉంటుందని, అఫిడవిట్‌ను తప్పనిసరి చేస్తే మధ్యవర్తులు అదనపు మొత్తం వసూలు చేసే ప్రమాదం ఉంటుందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. నిర్దేశిత మొత్తాన్ని తనకు ఇవ్వలేదంటూ విక్రయదారుడు అడ్డం తిరిగితే.. న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం లేకపోలేదన్న చర్చ జరిగింది. మార్గదర్శకాల నుంచి అఫిడవిట్ నిబంధనను తొలగించాలన్న డిమాండ్ వ్యక్తమైంది. ఈ మేరకు గత అక్టోబరులో అఫిడవిట్ ఆవశ్యకతపై రెవెన్యూశాఖ న్యాయసలహా కోరింది. దీనిపై అడ్వకేట్ జనరల్ స్పందిస్తూ అఫిడవిట్ తప్పనిసరి కాదని, మార్గదర్శకాల నుంచి ఆ నిబంధనను మినహాయించుకోవచ్చని స్పష్టం చేశారు. ఏజీ నుంచి సానుకూల స్పందన రావడంతో అఫిడవిట్‌ను మినహాయిస్తూ మార్గాదర్శకాలను సవరించేందుకు సీసీఎల్‌ఏ సన్నద్ధమవుతోంది.

**పరిష్కారం అరకొరగానే ఉంది**

సాదాబైనామాకు సంబంధించి 9,00,880 దరఖాస్తులు వస్తే.. వాటిలో 9,00,566 దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేశారు. మొత్తం దరఖాస్తుల్లో తహసీల్దార్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు పంపినవి 6,65,249. ఇందులో ఆమోదించిన సర్వే నంబర్లు కేవలం 162. తిరస్కరించిన సర్వే నంబర్లు 4,06,991. ఇందులో చాలా వరకు అఫిడవిట్ ఇవ్వకపోవడం వల్ల తిరస్కరించినవేనని రైతులు ఆరోపిస్తున్నారు. అఫిడవిట్ నిబంధనను మినహాయిస్తే సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి ఆటంకం తొలగినట్టేనని రెవెన్యూ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

# సామ్రాజ్యవాదుల కంటే భాజపా ప్రమాదకరం

హైదరాబాద్

బ్రిటిష సామ్రాజ్యవాదుల కంటే భాజపా ప్రమాదకరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కొత్త చట్టం ఏదీ తేకపోగా నాడు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన వాటిని రద్దుచేసే కార్యక్రమం చేపట్టిందని విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కొత్తగా తెచ్చిన ఉపాధి చట్టం రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిద్దాం. ప్రభుత్వంలోని పెద్దలంతా ఆందోళన కార్యక్రమంలో పాల్గొంటారు. స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలు, ఆందోళన చేసినా బ్రిటిష్ పాలకులు ఏనాడూ గాంధీజీపై లాఠీ ఎత్తలేదు. స్వాతంత్ర్యం వచ్చిన కొద్దినెలల వ్యవధిలోనే ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగినవారు ఆయన్ను కాల్చి చంపారు. అలాంటి గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు భాజపా ప్రభుత్వం చేస్తున్న కుట్రలను రాష్ట్రంలోని ప్రజలందరికీ వివరించాలి. పాత చట్టంలో కాంట్రాక్టర్లకు స్థానం లేదు. కానీ ఇప్పుడు వారితో కలిసి పనిచేసుకునేలా చట్టంలో మార్పు తీసుకొచ్చారు. రాష్ట్రాలు 40% వాటాను విడుదల చేయకపోతే కేంద్రం తన నిధులను విడుదల చేయదనే నిబంధన పెట్టారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో 40% విడుదల చేయరు ఆ తర్వాత కేంద్రం కూడా విడుదల చేయదు. చివరికి ఆ రాష్ట్రాల్లో ఉపాధి పథకాన్ని రద్దుచేసే కుట్ర జరుగుతుంది. కాంగ్రెస్ బలంగా ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో భారీ వ్యత్యాసం ఉంటుంది" అని అన్నారు.

ప్రాధాన్యాన్ని నీరుగార్చేందుకు సంస్కరణలు: ఉత్తమ్

జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు గ్రామీణ ఉపాధికి మరణశాసనమేనని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. 'ఉపాధి హామీ పథకం ప్రాధాన్యాన్ని నీరు గార్చేందుకు మోదీ సర్కారు సంస్కరణలు తీసుకొచ్చింది. ఈపథకంలో గాంధీ పేరు ఉన్నందునే కేంద్రం ఉద్దేశపూర్వకంగానే బలహీనపరుస్తోంది. ఈపథకానికి తూట్లు పొడిచేలా కేంద్రప్రభుత్వం రూట్ మ్యాప్ రూపొందించింది. పథకంలో గ్రామ పంచాయతీకి ఉన్న హక్కులను తొలగించి ఘోరంగా దెబ్బతీసింది. 40 శాతం నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపడమంటే గ్రామీణ కూలీల జీవన ప్రమాణాలపై నేరుగా దాడి చేయడమే అవుతుంది. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేతలు పోరాటాలకు సన్నద్ధం కావాలి" అని ఆయన అన్నారు.



**20 నుంచి గ్రామసభలు: మహేశ్‌కుమార్**

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఏఐసీసీ సూచన మేరకు జీ రామ్ జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు ఉద్ధృతం చేస్తామన్నారు. 'ఈ నెల 20 నుంచి 30 వరకూ అన్ని గ్రామాల్లో ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ గ్రామసభలు నిర్వహించాలి. గతంలో అమలైన ఉపాధి హామీ చట్టం గొప్పతనాన్ని వివరిస్తూ ప్రతి నియోజకవర్గానికీ 5 వేల చొప్పున కరపత్రాలు పంపిణీ చేయాలి. విదేశాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకం గురించి ఆరా తీసి వివరాలను తెలుసుకున్నారు. పేదల హక్కు కాలరాసి భిక్షాందేహి అని వారనేలా కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీకి సవరణలు తెచ్చింది. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా నిరసనగా గ్రామసభలు నిర్వహించేలా జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)లు బాధ్యత తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు.

## సర్.. పెద్ద కుట్ర

-మొదటిపేజీ తరువాయి

అప్పగిస్తుందని, జాగ్రత్తగా ఆలోచించండని రాహుల్‌గాంధీ, ఖర్గేలు ప్రజలను చైతన్యపరిచారు. ఫలితంగా భాజపా 240 సీట్ల దగ్గరే ఆగిపోయింది. వారి ఆలోచనను మరో రూపంలో అమలు చేయడానికి ఓటరు జాబితాల ప్రక్షాళనకు బయలుదేరారు.

**పేదలను కట్టుబానిసలుగా మార్చేందుకు...**

పేదలను కార్పొరేట్ కంపెనీలకు కట్టుబానిసలుగా మార్చేందుకు ఉపాధి హామీ పథకానికి సవరణలు చేసిన మోదీ కొత్తగా జీ రామ్‌జీ చట్టాన్ని తెచ్చారు. అదానీ, అంబానీ వంటివారికి తక్కువ రేట్లకు కూలీలు దొరకడం లేదు. ఈ పథకాన్ని రద్దుచేస్తే పేదలు మళ్లీ గ్రామాల నుంచి పట్టణాలకు వలస వస్తారని, వారిని కార్పొరేట్ కంపెనీలకు తక్కువ రేటు కూలీలుగా మార్చొచ్చని మోదీ ప్రయత్నిస్తున్నారు. గతంలో వ్యవసాయాన్ని అమెజాన్, అదానీ, అంబానీలకు తాకట్టు పెట్టాలని మూడు నల్ల చట్టాలను తెచ్చారు. వాటిని ఉపసంహరించుకునేలా చేసి, ఈ జాతికి క్షమాపణ చెప్పిస్తానని అప్పుడు రాహుల్‌గాంధీ స్పష్టంగా మోదీకి చెప్పారు. అప్పటివరకూ పోరాటం చేస్తామన్నారు. అది నిజమైంది.

**గ్రామసభల తీర్మానాల బాధ్యత మంత్రులదే**

రాష్ట్రమంతా సర్పంచులు ఈ నెల 20 నుంచి 30లోగా గ్రామసభలు పెట్టి జీ రామ్‌జీ చట్టాన్ని తిరస్కరిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయాలి. హైదరాబాద్, సికింద్రాబాద్ మినహా మొత్తం 15 లోక్‌సభ నియోజకవర్గాలకు ఒక్కో మంత్రి బాధ్యత తీసుకుని... ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలంటూ గ్రామసభల్లో తీర్మానించేలా చూడాలి. ప్రతి మండలానికి ఒక నాయకుడిని నియమించి బాధ్యతలు అప్పగించాలి. నేను కూడా ఒక మండలం బాధ్యత తీసుకుని పర్యవేక్షిస్తా. ఫిబ్రవరి 3న మహబూబ్‌నగర్‌తో ప్రారంభించి తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో లక్ష మంది చొప్పున ప్రజలతో బహిరంగ సభలు పెట్టి ఈ పథకంలో తెచ్చిన మార్పులను ప్రజలకు చెపుతా. ములుగులో సభకు సోనియాగాంధీ వచ్చేలా చూస్తాం. ఆమె రాలేకపోతే ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీలను తీసుకొస్తాం. పంచాయతీ ఎన్నికల్లో మన పార్టీ కార్యకర్తలు 66% విజయాలు సాధించారు. ఇక మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. అన్ని మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తేనే మంత్రులు, ఎమ్మెల్యేలు నిధులివ్వగలరని ప్రజలకు చెప్పాలి. భారాస వాళ్లు శాసనసభలో చర్చలకే రావడం లేదు. గత రెండేళ్లలో వారిలో ఒక్కరైనా సమస్యల పరిష్కారానికి నిధులు కావాలని నన్ను అడగలేదు. భారాసకు అభివృద్ధిపై పట్టింపు లేదనే విషయాన్ని ప్రజలకు కాంగ్రెస్ శ్రేణులు వివరించాలి.

**గెలిచిన వారే గొప్పవారు**

ప్రభుత్వంలోని చాలామంది మంత్రులు తాతల వారసత్వం నుంచి వచ్చినవారు కాదు. సీతక్క మారుమూల గూడెం నుంచి ఎంతో కష్టపడి పైకొచ్చారు. సమక్క-సారలమ్మ గద్దెల అభివృద్ధికి నిధులు తీసుకెళ్లారు. ఎన్నికల్లో ఓడితూ ఎన్ని చెప్పినా ఎవరూ వినరు. గెలిచిన వారే గొప్పవారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో, పంచాయతీ ఎన్నికల్లో గల్లీగల్లీలో సీఎం ఎందుకు తిరుగుతున్నారని కొందరు అన్నారు. కాంగ్రెస్ ఓడిపోతే ఎవరు వింటారు? ఎన్నికల్లో పార్టీ బీఫాం ఎవరికి ఇస్తే వారిని గెలిపించాల్సిందే" అని సీఎం రేవంత్ స్పష్టంచేశారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, అజారుద్దీన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, ప్రవీణ్ చక్రవర్తి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు హాజరయ్యారు.

## డీలర్ వద్దే రిజిస్ట్రేషన్

-మొదటిపేజీ తరువాయి

తాత్కాలిక రిజిస్ట్రేషన్‌ను(టీఆర్) డీలర్ వద్ద చేసుకునే వారు. శాశ్వత రిజిస్ట్రేషన్‌కు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. కార్యాలయాల్లో ముడుపులు ఇస్తేనే పనులు జరుగుతాయన్న విమర్శలు ఉన్నాయి. వీటికి పరిష్కారంగా డీలర్ వద్దనే వ్యక్తిగత వాహనాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పలు రాష్ట్రాల్లో కేంద్ర రోడ్డు రవాణా, రహదారి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వాహన్, సారథి పోర్టల్‌ల ద్వారా షోరూంలోని డీలర్ వద్దనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఈ పోర్టల్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి ఆరు నెలల సమయం పట్టే అవకాశాలు ఉండడంతో వెంటనే ఈ నిబంధనలను అమలు చేయడానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు.

**కొత్త వాహనదారులు ఏం చేయాలంటే..**

అధీకృత డీలర్ వద్ద శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేయాలంటే పలు పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

1) ఇన్వాయిస్
2) ఫారం-21(విక్రయ ధ్రువీకరణ)
3) ఫారం-22 (రోడ్డు అనుకూలత ధ్రువీకరణ)
4) బీమా పత్రం
5) కొనుగోలుదారుల చిరునామా ధ్రువీకరణ
6) మరో వాహనం లేదని డిక్లరేషన్
7) కొనుగోలుదారుల ఫొటో, సంతకం స్కాన్ కాపీ
8) వాహనం ఇంజిన్, ఛాసిస్ నంబర్ల ఫొటోలు
9) అవసరం మేరకు రవాణా శాఖ నిర్దేశించే ఇతర పత్రాలు

డీలర్ నుంచి వచ్చిన వాహన కొనుగోలుదారుల దరఖాస్తులను రిజిస్టరింగ్ అథారిటీ/ అదనపు రిజిస్టరింగ్ అథారిటీ పరిశీలించి నిబంధనల మేరకు పత్రాలను ఆమోదించడం లేదా తిరస్కరించడం చేస్తుంది.

రిజిస్ట్రేషన్ పత్రాన్ని(ఆర్‌సీ) స్పీడ్ పోస్ట్ ద్వారా కొనుగోలుదారులకు పంపిస్తారు.

అధీకృత డీలర్ల వద్ద ఉన్న వాహనాల నిల్వలపై వెహికిల్ ఇన్‌స్పెక్టర్/ఆర్టీవో/డీటీసీ/జేటీసీ/ రవాణా కమిషనర్ ఎప్పుడైనా తనిఖీలు చేపట్టవచ్చు.

## వీడీజీపీ నియామకంపై నేడు హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్



డీజీపీ శివధర్‌రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం ఉత్తర్వులు వెలువరించనున్నట్లు హైకోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని పేర్కొంటూ టీ ధన్‌గోపాలరావు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ నియామకం కోసం సీనియర్ ఐపీఎస‌ల జాబితాను యూపీఎస్సీకి అందజేసిందని పేర్కొన్నారు. అయితే ఆలస్యం అయిందనే కారణం చూపుతూ దానిని తిప్పి పంపిందని, ఈ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు పాటించలేదని పేర్కొన్నారు. యూపీఎస్సీ తరఫు న్యాయవాది అజయ్‌కుమార్ వాదిస్తూ.. బాగా ఆలస్యంగా డీజీపీ నియామకం కోసం జాబితా పంపారని తెలిపారు. దీనిపై అటార్నీ జనరల్ నుంచి న్యాయసలహా తీసుకున్న తరువాత జాబితాను యూపీఎస్సీ తిప్పి పంపినట్టు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేస్తామని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

